ఈ సాలా కప్ నమ్మదల్ల!

ఉత్కంఠ పోరులో రాజస్థాన్‌దే గెలుపు • సమిష్టిగా విఫలమైన ఆర్సీబీ బ్యాటర్లు • జైస్వాల్, పరాగ్ మెరుపులతో గట్టెక్కిన రాయల్స్

గడిచిన 16 సీజన్లుగా ఊరిస్తున్న ట్రోఫీ దక్కించుకోవడంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) 17వ సారీ తడబడింది. రాజస్థాన్ రాయల్స్‌తో అహ్మదాబాద్‌లో జరిగిన 'ఎలిమినేటర్' పోరులో ఓడింది. ప్లేఆఫ్స్ చేరడానికి ఒక్క శాతం అవకాశం ఉన్నా దానిని రెండు చేతులా ఒడిసిపట్టుకుని అద్భుత పోరాటంతో నాకౌట్ దశకు వచ్చిన బెంగళూరు.. మరోసారి ఒత్తిడికి చిత్తై ఖాళీ చేతులతో వెనుదిరిగింది. గత 4 మ్యాచ్‌లలో ఓడిన రాజస్థాన్.. కీలక పోరులో జూలు విదిల్చింది. సమిష్టిగా రాణించి క్వాలిఫయర్-2లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మరో కీలకపోరుకు సిద్ధమైంది. ఓటమితో ఆర్సీబీ మరోసారి 'ఈ సాలా కప్ నమ్మదల్ల' (ఈసారి కూడా కప్ మనది కాదు) అంటూ నిరాశగా వెనుదిరిగింది.

• నిరాశలో కోహ్లీ

ఆర్సీబీకి 17వ 'సారీ'

అహ్మదాబాద్: ఐపీఎల్ ప్రతి సీజన్‌కు ముందు 'ఈసాలా కప్ నమ్దే' అంటూ హంగామా చేసే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అభిమానులకు మరోసారి నిరాశే ఎదురైంది. కీలకమైన 'ఎలిమినేటర్' పోరులో రాజస్థాన్ రాయల్స్ సమిష్టిగా రాణించి బెంగళూరుపై 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. 173 పరుగుల ఛేదనలో తడబడ్డా యశస్వీ జైస్వాల్ (30 బంతుల్లో 45, 8 ఫోర్లు), రియాన్ పరాగ్ (26 బంతుల్లో 36, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో ఆ జట్టు 19 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు.. అవేశ్ ఖాన్ (3/44), అశ్విన్ (2/19), బౌల్ట్ (1/16) కట్టడిచేయడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 172 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టులో రజత్ పాటిదార్ (22 బంతుల్లో 34, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), విరాట్ కోహ్లీ (24 బంతుల్లో 33, 3 ఫోర్లు, 1 సిక్సర్) ఫర్వాలేదనిపించారు. అశ్విన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

బ్యాటింగ్ అంతంతమాత్రంగానే..

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు ఇన్నింగ్స్‌లో ఒక్క బ్యాటర్ కూడా 35 పరుగుల మార్కును దాటకపోవడం ఆ జట్టు భారీ స్కోరు అవకాశాలను భారీగా దెబ్బతీసింది. సారథి ఫాఫ్ డుప్లెసిస్ (17) మరోసారి నిరాశపరచగా బెంగళూరు భారీ ఆశలు పెట్టుకున్న కోహ్లీ ఉన్నంతసేపు ఫర్వాలేదనిపించినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. సందీప్‌శర్మ 5వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన కోహ్లీని చాహల్ 8వ ఓవర్లో పెవిలియన్‌కు పంపాడు. బ్యాటింగ్‌లో ప్రమోషన్ పొందిన కామెరూన్ గ్రీన్ (27) తో పాటు మ్యాక్స్‌వెల్ (0)ను వరుస బంతుల్లో ఔట్ చేసిన అశ్విన్.. ఆర్సీబీని దెబ్బతీశాడు. ఐదు పరుగుల వద్ద జురెల్ క్యాచ్ మిస్ చేయడంతో బతికిపోయిన పాటిదార్ ఆదుకునే యత్నం చేసినా 15వ ఓవర్లో అవేశ్ ఖాన్ అతడి ఆట కట్టించాడు. దినేశ్ కార్తీక్ (11) సైతం అవేశ్ బౌలింగ్‌లోనే జైస్వాల్ చేతికి చిక్కాడు. ఆఖర్లో మహిపాల్ లోమ్రర్ (17 బంతుల్లో 32 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడి బెంగళూరుకు పోరాడే స్కోరును అందించాడు.

రాజస్థాన్ తడబడ్డా..

మోస్తరు ఛేదనను రాజస్థాన్ ధాటిగానే ఆరంభించింది. జైస్వాల్, కోహ్లర్ (15 బంతుల్లో 20, 4 ఫోర్లు) ఆది నుంచే బెంగళూరు బౌలర్లపై ఎదురుదాడికి దిగి తొలి వికెట్‌కు 5.3 ఓవర్లలోనే 46 పరుగులు జోడించారు. యశ్ దయాల్ 3వ ఓవర్లో జైస్వాల్ నాలుగు బౌండరీలు బాదగా సిరాజ్ 4వ ఓవర్లో కోహ్లర్ 2 ఫోర్లు సాధించాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన ఫెర్గూసన్.. 6వ ఓవర్లో మూడో బంతికి కోహ్లర్‌ను బౌల్డ్ చేశాడు. కెప్టెన్ సంజూ శాంసన్ (17)తో జతకలిసిన జైస్వాల్.. దూకుడును కొనసాగించాడు. కానీ గ్రీన్ 10వ ఓవర్లో జైస్వాల్.. దినేశ్ కార్తీక్‌కు క్యాచ్ ఇవ్వగా 11వ ఓవర్లో కర్ణ్ శర్మ వేసిన వైడ్ బంతిని ముందుకొచ్చి ఆడబోయిన శాంసన్ స్టంపౌట్ అయ్యాడు. బౌండరీ లైన్ నుంచి కోహ్లీ వేసిన సూపర్ త్రో తో జురెల్ (8) రనౌట్‌గా వెనుదిరిగాడు. ఈ క్రమంలో బెంగళూరు బౌలర్లు కాస్త ఒత్తిడి తెచ్చినా పరాగ్, షిమ్రన్ హెట్‌మెయర్(26) ఆర్సీబీకి ఆ అవకాశమివ్వలేదు. గ్రీన్ 16వ ఓవర్లో ఈ ఇద్దరూ 17 పరుగులు పిండుకుని రాజస్థాన్‌ను విజయానికి దగ్గర చేశారు. రాయల్స్ గెలుపునకు 16 పరుగుల దూరంలో సిరాజ్ 18వ ఓవర్లో పరాగ్, హెట్‌మెయర్ ఔట్ అవడంతో రాజస్థాన్ శిబిరంలో ఉత్కంఠ రేగింది. కానీ రోవ్‌మన్ పావెల్ (16 నాటౌట్) ఫెర్గూసన్ 19వ ఓవర్లో 14 పరుగులు రాబట్టి ఆ జట్టును క్వాలిఫయర్-2కు చేర్చాడు.

అశ్విన్ (2/19)

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 172/8 (పాటిదార్ 34, కోహ్లీ 33, అవేశ్ 3/44, అశ్విన్ 2/19). రాజస్థాన్: 19 ఓవర్లలో 174/6 (జైస్వాల్ 45, పరాగ్ 36, సిరాజ్ 2/33, కర్ణ్ 1/19)

సచిన్‌కు స్వర్ణం

కోబ్: ప్రపంచ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ల పతకాల వేట కొనసాగుతోంది. కోబ్ (జపాన్) వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం.. పురుషుల షాట్‌పుట్ ఎఫ్46 ఈవెంట్‌లో సచిన్ సర్జీరావ్ స్వర్ణం నిలబెట్టుకున్నాడు. ఇనుప గుండును 16.30 మీటర్ల దూరం విసిరిన సచిన్.. పసిడితో పాటు ఆసియా రికార్డు (గతేడాది 16.21 మీటర్లు) నమోదు చేశాడు. పురుషుల క్లబ్ త్రో ఎఫ్51 కేటగిరీలో ధరంబీర్ రజతం గెలుచుకున్నాడు. 12 పతకాలతో భారత్.. 2023 ఎడిషన్ పతకాల(10) సంఖ్యను అధిగమించింది.

భారత్‌కు మిశ్రమ ఫలితాలు

• ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్

అంట్వెర్ప్: ఇంటర్నేషనల్ హాకీ ఫెడరేషన్ (ఎఫ్ఐహెచ్) ప్రో లీగ్‌లో భారత హాకీ జట్లకు మిశ్రమ ఫలితాలు దక్కాయి. బుధవారం అర్జెంటీనాతో జరిగిన మ్యాచ్‌లలో పురుషుల జట్టు గెలుపొందగా అమ్మాయిలు ఓటమి పాలయ్యారు. అర్జెంటీనాతో మ్యాచ్‌ను 2-2తో సమం చేసుకున్న అబ్బాయిలు.. పెనాల్టీ షూటౌట్‌లో 5-4 తేడాతో ఉత్కంఠ విజయం సాధించారు. ఇక అమ్మాయిల ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో అర్జెంటీనా.. 5-0తో భారత్‌ను చిత్తుగా ఓడించింది.

ఫైనల్లో అమ్మాయిలు

ఆర్చరీ ప్రపంచకప్ టోర్నీ

యోచియాన్(దక్షిణకొరియా): ప్రతిష్ఠాత్మక ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2లో భారత మహిళల కాంపౌండ్ టీమ్ ఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో జ్యోతిసురేఖ, పర్నీత్ కౌర్, అదితిస్వామితో కూడిన భారత త్రయం 233-229 తేడాతో అమెరికాపై అద్భుత విజయం సాధించింది. శనివారం టర్కీతో జరిగే ఫైనల్లో భారత్ తలపడుతుంది. మరోవైపు పురుషుల కాంపౌండ్ టీమ్ కాంస్య పోరులో ఆస్ట్రేలియా చేతిలో ప్రియాంశ్, పార్థమేశ్, అభిషేక్ త్రయం పోరాడి ఓడింది.

ప్రిక్వార్టర్స్‌కు సింధు

మలేషియా మాస్టర్స్‌లో భారత షట్లర్ల దూకుడు

కౌలాలంపూర్: సుమారు నెలన్నర విరామం తర్వాత బరిలోకి దిగిన బ్యాడ్మింటన్ స్టార్ షట్లర్ పీవీ సింధు మలేషియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. కౌలాలంపూర్‌లో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సింధు 21-17, 21-16 తేడాతో కిర్స్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)ను వరుస సెట్లలో చిత్తుచేసింది. పారిస్ ఒలింపిక్స్‌కు సన్నద్ధమయ్యేందుకు గాను ఇటీవల ముగిసిన ఊబర్ కప్, థాయ్‌లాండ్ మాస్టర్స్‌కు దూరంగా ఉన్న ఈ తెలుగమ్మాయి.. 46 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించింది. మహిళల సింగిల్స్‌లో అష్మిత చాలిహ 21-17, 21-16తో లిన్ సి యున్ (తైవాన్)ను ఓడించగా పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో కిరణ్ జార్జి 21-16, 21-17తో టకుమా ఒబయాషి (జపాన్)ను మట్టికరిపించి ప్రిక్వార్టర్స్‌కు చేరారు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో భార్యాభర్తల జోడీ సుమిత్‌రెడ్డి- సిక్కిరెడ్డి.. 21-15, 12-21, 21-17 తో లుయి చున్ - పు చి యన్ (హాంకాంగ్)పై గెలుపొందారు. పురుషుల డబుల్స్ ద్వయం కృష్ణ ప్రసాద్ - సాయి ప్రతీక్.. 23-21, 21-11తో తైవాన్ జోడీ టాంగ్ కె వి-ఎం. సి ను చిత్తుచేశారు.

వింబుల్డన్ మెయిన్ డ్రాకు నాగల్

• ఐదేండ్ల తర్వాత తొలి ఇండియన్

ఢిల్లీ: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ మెయిన్ డ్రాకు భారత టెన్నిస్ యువ సంచలనం సుమిత్ నాగల్ అర్హత సాధించాడు. ప్రస్తుతం పారిస్ వేదికగా జరుగుతున్న (మే 26 నుంచి ప్రధాన టోర్నీ ఆరంభం) ఫ్రెంచ్ ఓపెన్‌కు సిద్ధమవుతున్న నాగల్.. గత నెల ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్ విభాగంలో 80కి చేరుకోవడంతో వింబుల్డన్‌లో ఆడే అవకాశం దక్కింది. తద్వారా ఐదేండ్ల తర్వాత ఈ టోర్నీలో మెయిన్ డ్రా ఆడబోయే తొలి భారతీయుడి (2019లో ప్రజ్నేష్ గుణేశ్వరన్)గా అతడు రికార్డులకెక్కాడు. 2015లోజూనియర్ స్థాయిలో వింబుల్డన్ బాయ్స్ డబుల్స్ టైటిల్ నెగ్గిన నాగల్‌కు.. 2018లో క్వాలిఫయింగ్ రౌండ్ ఆడిన అనుభవముంది.

'బెంగాల్ రెండుగా విడిపోయింది': గంభీర్

కోల్‌కతా: కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తనకున్న సుదీర్ఘ నేపథ్యాన్ని మాజీ కెప్టెన్ గౌతం గంభీర్ గుర్తుకు తెచ్చుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ యూట్యూబ్ చానల్‌తో గంభీర్ మాట్లాడుతూ 'కోల్‌కతాతో 2011లో నా అనుబంధం మొదలైంది. అప్పటి నుంచి ఇప్పటిదాకా అక్కడి అభిమానులతో ఉన్న అనుబంధం మరువలేనిది. సరిగ్గా 13 ఏండ్ల క్రితం ఈడెన్ గార్డెన్స్‌లో పుణె వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో నేను కోల్‌కతాకు ఆడితే.. ఇక్కడి నుంచి వచ్చిన గంగూలీ పుణెకు ఆడాడు. దీంతో స్టేడియంలో ఓవైపు ఉదారంగు పులుముకుంటే మరోవైపు లేత నీలిరంగు జెర్సీలతో నిండిపోయింది. చారిత్రక విభజన తర్వాత బెంగాల్ రెండుగా విడిపోయిం దంటూ ప్రముఖ టెలీగ్రాఫ్ పత్రిక ప్రముఖంగా ప్రచురించింది' అని పేర్కొన్నారు.

కోహ్లీకి ఉగ్ర ముప్పు!

అహ్మదాబాద్: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ క్రికెటర్ విరాట్‌కోహ్లీకి ఉగ్రముప్పు పొంచి ఉన్నట్లు తెలిసింది. ఈ కారణంగానే రాజస్థాన్ రాయల్స్‌తో ఎలిమినేటర్ మ్యాచ్‌కు ముందు ఆర్‌సీబీ ప్రాక్టీస్ రద్దయినట్లు వార్తలు వచ్చాయి. స్థానిక వార్తాసంస్థ ఆనంద్‌బజార్ పత్రిక కథనం ప్రకారం ప్రాక్టీస్‌తో పాటు మీడియా భేటీ రద్దు అయినట్లు తెలిసింది. కొన్ని రోజుల క్రితం అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఐసిస్ అనుమానిత ఉగ్రవాదులను గుజరాత్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సూచనలతో ఆర్‌సీబీ తమ ప్రాక్టీస్ క్యాన్సిల్ చేసుకుంది. ఇదిలా ఉంటే గుజరాత్ క్రికెట్ అసోసియేషన్(జీసీఏ) ప్రకటన మరోలా ఉంది. జీసీఏ చీఫ్ అనిల్ మాట్లాడుతూ ఎలాంటి ఉగ్రవాద ముప్పులేదని, తీవ్ర వేడి కారణంగా ప్రాక్టీస్ చేయలేదని పేర్కొన్నాడు.

మహిళా క్రికెటర్లకు దేశవాళీ లీగ్స్

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మహిళా క్రికెటర్ల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) దేశవాళీ లీగ్స్‌ను ప్రవేశపెట్టబోతున్నది. బుధవారం నిజామాబాద్‌లో హెచ్‌సీఏ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ' క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే విషయంలో అమ్మాయిల తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దేశంలో తొలిసారి మహిళా క్రికెటర్ల కోసం డొమెస్టిక్ లీగ్‌ను తీసుకొస్తున్నాం. జాతీయ స్థాయితో పాటు డబ్ల్యూపీఎల్‌లో తెలంగాణ ప్రాతినిధ్యం పెరగాలి' అని అన్నారు.

ప్రతిష్ఠాత్మక పారా అథ్లెటిక్స్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం సాధించి స్వదేశం చేరుకున్న యువ అథ్లెట్ జివాంజీ దీప్తికి బుధవారం హైదరాబాద్‌లో ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ కోచ్ రమేశ్, పలువురు అథ్లెట్లు పాల్గొన్నారు.

అదానీ.. నయా బొగ్గు కహానీ

కారుచవగ్గా నాణ్యతలేని బొగ్గు కొనుగోలు

- ప్రభుత్వ సంస్థకు హైగ్రేడ్ క్వాలిటీగా బురిడీ
- మూడు రెట్లకు పైగా ధర పెంచి విక్రయాలు
- అదానీ గ్రూప్ మరో బొగ్గు స్కామ్ వెలుగులోకి..
- ఓసీసీఆర్పీ, ఫైనాన్షియల్ టైమ్స్‌లో సంచలన కథనం
- ఈ స్కామ్ దేశప్రజలకు ఆర్థిక భారమే కాదు ప్రాణనష్టం కూడా: క్లైమెట్ ఎనర్జీ ఫైనాన్స్ డైరెక్టర్
- కాలుష్యంతో దేశంలో ఏటా 20 లక్షల మంది మృతి

ఏమిటీ మోసం?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 22 (నమస్తే తెలంగాణ): బొగ్గు గనుల లీజు విషయంలో ఇప్పటికే ఎన్నో విమర్శలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్.. బొగ్గు విక్రయాల్లో కూడా అక్రమాలకు పాల్పడింది. నాణ్యతలేని బొగ్గును కారుచౌకగా కొనుగోలు చేసి దాన్ని హై-గ్రేడ్ క్వాలిటీ బొగ్గుగా నమ్మించి ఎక్కువ ధరకు విక్రయించింది. ఇలా ప్రభుత్వరంగ విద్యుత్తు కంపెనీ నుంచి దాదాపు రూ. 3 వేల కోట్లు దోచుకొన్నది. ఈ మేరకు ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్పీ), అంతర్జాతీయ పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ కథనాల్లో వెల్లడించింది.

ప్రజల జీవితాలతో ఆటలు

అదానీ బొగ్గు అక్రమాలతో ప్రజలపై ఆర్థిక భారం పడటమే కాదు, వారి ప్రాణాలు కూడా ప్రమాదంలో నెట్టబడ్డాయని పర్యావరణ నిపుణులు మండిపడుతున్నారు. నాణ్యతలేని బొగ్గుతో విద్యుదుత్పత్తి తక్కువగా జరుగుతుందని, అలాగే పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని ఆస్ట్రేలియాకు చెందిన క్లైమెట్ ఎనర్జీ ఫైనాన్స్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ టిమ్ బక్లే అన్నారు. దీంతో విద్యుత్తు ఛార్జీలు పెరిగి భారత్‌లోని పేదలు మరింత పేదరికంలోకి కూరుకుపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ కాలుష్యం జరిగి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని మండిపడ్డారు. గాలి కాలుష్యంతో ఏటా భారత్‌లో 20 లక్షల మంది మరణిస్తున్నారని లాన్సెట్ ఇచ్చిన నివేదికను ఈ మేరకు ఉదహరించారు.

డీఆర్ఐ దృష్టిపెట్టడంతో కోర్టుకు..

అదానీ గ్రూప్ బొగ్గు అక్రమాలు ఇప్పటివి కాదు. ఎనిమిదేండ్లకిందటే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ).. అదానీ సంస్థల అక్రమాలను గుర్తించింది. ఇండోనేషియా నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటూ దేశంలో కృత్రిమ బొగ్గు కొరతను సృష్టిస్తున్నారని, దీన్ని విదేశాలకు ధనాన్ని తరలించే మార్గంగానూ మార్చుకుంటున్నారని అదానీసహా 40 దిగుమతిదారులకు 2016లో డీఆర్ఐ నోటీసులిచ్చింది. అసలు పోర్టుల్లో దిగుమతైన బొగ్గుకు చూపించిన ధరల్లో 50 శాతానికే కొంటున్నారని పేర్కొంది. ఈ బొగ్గుతో తయారైన విద్యుత్తును అధిక ధరలకు అమ్ముకుంటున్నారని ఆరోపించింది. ఎక్కువ ధరకు విద్యుత్తును కొని ప్రజలు, వ్యాపార, పారిశ్రామిక వర్గాలు నష్టపోతున్నాయని తేల్చిచెప్పింది. అయితే, డీఆర్ఐ దర్యాప్తును నిలిపేయాలంటూ బాంబే హైకోర్టు నుంచి అదానీ గ్రూప్ స్టే తెచ్చుకొన్నది. దీంతో డీఆర్ఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అనంతరం ఈ కేసు అటకెక్కింది.

2014లో ఇండోనేషియా నుంచి దాదాపు 69,925 మెట్రిక్ టన్నుల బొగ్గును అదానీ కంపెనీ కొనుగోలు చేసింది. ఇది నాణ్యతలేని బొగ్గు. ధర చాలా తక్కువ. అయితే, ఇదే బొగ్గును హై-గ్రేడ్ క్వాలిటీ బొగ్గుగా ధ్రువపర్చిన అదానీ కంపెనీ.. తమిళనాడులో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న టీఏఎన్‌జీఈడీసీవో విద్యుత్తు సంస్థకు మూడు రెట్లు ధర పెంచి విక్రయించింది. సంస్థను నమ్మించడానికి క్వాలిటీ చెక్ రిపోర్ట్‌ను కూడా మార్చివేసింది. ఇలా పలుమార్లు విక్రయాలు జరిగాయి. ఈ మేరకు ఓసీసీఆర్పీ, ఫైనాన్షియల్ టైమ్స్ నివేదికలో ఆరోపించాయి. కొన్ని ఇన్‌వాయిస్ పత్రాలను ఈ సందర్భంగా విడుదల చేశాయి. ఒక్కో టన్ను బొగ్గుకు 92 డాలర్లను అదానీ కంపెనీ ఛార్జీ చేసినట్టు పేర్కొన్నాయి. ఇలా 2014-2016 మధ్య అదానీ కంపెనీ కారణంగా టీఏఎన్‌జీఈడీసీవో సంస్థకు మొత్తంగా రూ. 3 వేల కోట్ల మేర నష్టంవాటిల్లినట్టు 2018లో అరప్పూర్ అయక్కమ్ అనే ఎన్జీవో సంస్థ ఆరోపించిన విషయాన్ని ఓసీసీఆర్పీ ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఒక్క 2014లోనే కాదు ఆ తర్వాత కూడా ఇలాంటి మోసాలకు అదానీ గ్రూప్ పాల్పడి ఉండవచ్చని ఓసీసీఆర్పీ అనుమానాలు వ్యక్తం చేసింది. కాగా, నిరుడు హిండెన్‌బర్గ్ ఆరోపణలతో పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయిన అదానీ గ్రూప్‌నకు.. తాజా ఆరోపణలు మరో మరకేనని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా తాజా నివేదికను అదానీ గ్రూప్ ఖండించింది. తమ విక్రయాలు పారదర్శకంగానే జరిగినట్టు చెప్పుకొచ్చింది. ఇదిలాఉండగా బొగ్గు గనుల లీజుల విషయంలో అదానీ గ్రూప్‌నకు కేంద్రంలోని మోదీ సర్కారు మేలు చేసేలా వ్యవహరించిందన్న విమర్శలు ఇప్పటికే ఉండటం తెలిసిందే.

భారత సంతతి సీఈవో వేతనం 1,261 కోట్లు

అత్యధిక వేతనం అందుకుంటున్న రెండో సీఈవో నికేశ్ అరోరా

వాషింగ్టన్, మే 22: ప్రపంచంలో అత్యధిక వేతనం పొందుతున్న సీఈవోల్లో భారత సంతతికి చెందిన వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. ఢిల్లీ ఎయిర్‌ఫోర్స్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్న నికేశ్ అరోరా, ఇప్పుడు ప్రపంచంలో అత్యధిక వేతనం అందుకుంటున్న రెండో సీఈవోగా నిలిచారు. సుందర్ పిచాయ్, మార్క్ జుకర్‌బర్గ్.. తదితరులు ఆయన తర్వాత ఉండటం గమనార్హం. 2023 ఏడాదికి సంబంధించి అత్యధిక వేతనాలు పొందుతున్న టాప్ సీఈవోల జాబితాను 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్' తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం, 'బ్రాడ్‌కామ్స్' సీఈవో హాక్‌టాన్ (162 మిలియన్ డాలర్లు) తర్వాత నికేశ్ అరోరా రెండో స్థానంలో ఉన్నారని తెలిపింది. అమెరికాలో సైబర్ సెక్యూరిటీ కంపెనీ 'పాలో ఆల్టో నెట్‌వర్క్స్' సీఈవోగా నికేశ్ అరోరా 151.43 మిలియన్ డాలర్ల (రూ.1,261కోట్లు) వేతన ప్యాకేజీని అందుకుంటున్నారని పేర్కొన్నది. గూగుల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్‌గా నికేశ్ అరోరా తొలుత ఇండస్ట్రీలో తనదైన ముద్రవేశారు. 2014లో ఆ సంస్థను వీడి జపాన్‌లోని ప్రముఖ బ్యాంక్‌లో కీలక బాధ్యతలు చేపట్టారు. 2018లో 'పాలో ఆల్టో నెట్‌వర్క్స్' సీఈవోగా చేరారు.

మహీంద్రా కొత్త ఎక్స్‌యూవీ 700

ప్రారంభ ధర రూ.16.89 లక్షలు

న్యూఢిల్లీ, మే 22: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా నయా ఎస్‌యూవీ మాడల్‌ను మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎక్స్‌యూవీ700 పేరుతో విడుదల చేసిన ఏఎక్స్5 మాడల్ ప్రారంభ ధరను రూ.16.89 లక్షలుగా నిర్ణయించింది. 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్ కలిగిన వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లేతో తీర్చిదిద్దింది. పుష్ స్టార్ట్/టాప్ బటన్, అడ్రెనోక్స్ కనెక్టెడ్ ఫీచర్స్, ఎల్ఈడీ డీఆర్ఎల్ఎస్, ఆరు స్పీకర్లతో సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. పెట్రోల్ ఇంజిన్ కలిగిన మాడల్ రూ.16.89 లక్షల నుంచి రూ.18.49 లక్షల లోపు, డీజిల్ మాడల్ రూ.17.49 లక్షల నుంచి రూ.19.09 లక్షలకు విక్రయించనున్నది.

'కోల్ కారిడార్'కు గ్రీన్‌సిగ్నల్

రామగుండం-మణుగూరు రైల్వేలైన్ భూసేకరణకు కేంద్రం నోటిఫికేషన్

నాలుగు జిల్లాలను కలుపుతూ 207 కిలోమీటర్ల లైన్

పెద్దపల్లి, మే 22(నమస్తే తెలంగాణ): సింగరేణి విస్తరించి ఉన్న నాలుగు జిల్లాలను కలుపుతూ కోల్‌కారిడార్ రైల్వేమార్గం నిర్మాణానికి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. 25 ఏండ్లుగా హామీలు, సర్వేలు, ప్రతిపాదనలు, పరిశీలనలతో కాగితాలకే పరిమితమైన రామగుండం-మణుగూరు రైల్వే లైన్‌కు బుధవారం కేంద్ర ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసింది. దక్షిణ మధ్య రైల్వే డివిజన్‌లో అత్యంత రద్దీగా ఉండే కాజీపేట-బల్లార్షా మార్గంలో మూడో లైన్‌ను నిర్మించినప్పటికీ సరుకు రవాణా విషయంలో మాత్రం గంటల కొద్దీ జాప్యం జరుగుతున్నది. ఫలితంగా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీనికి పరిష్కారంగా సింగరేణి గోదావరి పరీవాహక ప్రాంతాలైన పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను కలుపుతూ కోల్‌కారిడార్ నిర్మించాలని డిమాండ్ తెరపైకి వచ్చింది. 25 ఏండ్ల క్రితం 1999లోనే పెద్దపల్లి మండలం రాఘవాపూర్ మీదుగా మంథని, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం మీదుగా మణుగూరు వరకు రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం సర్వేలు, భూ పరీక్షలు చేసి కోల్‌కారిడార్‌గా పేరు పెట్టింది. గతంలో రూ.10కోట్లు నిధులు విడుదల చేసినప్పటికీ పనులు ముందుకుసాగలేదు. ఈ మార్గంలో మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాల్‌రావ్‌పేటల్లో స్టేషన్లను గుర్తించి, ప్రాథమికంగా అంచనా వేయగా, తాజాగా ఈ లైన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

వాణిజ్య

GRANULES

గ్రాన్యూల్స్‌లో తగ్గిన ప్రమోటర్ల వాటా

హైదరాబాద్, మే 22: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా ప్రమోటర్ కృష్ణ ప్రసాద్ తన వాటాను తగ్గించుకున్నారు. బహిరంగ మార్కెట్లో 3.09 శాతానికి సమానమైన 75 లక్షల షేర్లను విక్రయించడంతో రూ.304 కోట్ల నిధులు సమకూరాయి. బ్లాక్ డీల్ ద్వారా జరిగిన ఈ ఒప్పందంలో షేరు ఒక్కింటికి రూ.405.80 చొప్పున ఆయన బహిరంగ మార్కెట్లో విక్రయించారు. దీంతో సంస్థలో ఆయన వాటా 34.78 శాతం నుంచి 31.69 శాతానికి తగ్గింది.

కేంద్రానికి ఆర్బీఐ మెగా డివిడెండ్

గత అకౌంటింగ్ సంవత్సరానికిగాను రూ.2.11 లక్షల కోట్లు ప్రకటన

ముంబై, మే 22: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కేంద్ర ప్రభుత్వానికి గత అకౌంటింగ్ సంవత్సరానికి (2023-24)గాను అత్యధిక డివిడెండ్‌ను ప్రకటించింది. బుధవారం ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నాయకత్వంలో జరిగిన కేంద్ర బోర్డు డ